

# చీదలు వంజరాలు మాగలు కండసుదుములు

నీసు లేనిదే మా యింట్లో అది కూరా కాదు.

మేము తినేది అన్నమూ కాదు.

వారానికి ఆరు పగళ్లు ఆరు రాత్రిళ్లు నీసు వొండి ఏడో రోజు ఒక్కపూట కాయగూర వొండినా సరే మా నాయిన మొకం వికారంగా పెట్టి, కోడి కెలికినట్టుగా అన్నం కెలికి సయించనట్టుగా కంచాన్ని మా అమ్మ ముందుకు తోసే రకమేగానీ యిష్టంగా ఒక్క ముద్దయినా ముట్టే బాపతు గాదు.

మా నాయిన నీసుపిచ్చి చూసీ చూసీ, నీసు లేని రోజు ఆయన ఎప్పుడు తగూలాట మొదలుబెట్టినా 'మీ పట్టెపోళ్ల జాతికి (మా తాతది చేపలాపారం గదా) ఆ రామాయపట్నం ఆడోళ్లే కరెక్టు. ఆ ఊళ్లో పట్టెపోళ్లామెని కట్టుకోకుండా నా పాలబడి నీసో అని యాపకనూకడం దేనికి సామీ' అని మా నాయిన నోరు మూయించేది మా అమ్మ.

కూర సంగతికొస్తే మా నాయినదంతా 'హైతో ఖానా- నైతో సోనా' స్టయిలు (ఉంటే తినడం లాకుంటే పొణుకోవడం).

ఏ రోజయినా మా నాయిన యాభై రూపాయలు సంపాదించుకొని వచ్చినాడా... యింకయ్యి నీసు డబ్బుల కిందే లెక్క. పొద్దునొక నీసు కూరకీ సాయంత్రమొక నీసు కూరకీ ఆ డబ్బుల్లోని ఆఖరి అణా పైసాని కూడా జమెయ్యాల్సిందే.

మా ఊరికి అయిదు మైళ్ల దూరంలోనే తుమ్మలపెంట సముద్రం ఉంది కాబట్టి మాకు నీసంటే ప్రదానంగా చేపలకూరే. పొద్దున ఎనిమిది గెంటల కాణ్నుంచి మా యీదిలో చేపల బుట్టెత్తుకొని వచ్చే పట్టెపోళ్లామెని 'ఒమోవ్! చేపలూ' అని పిలవడంతో మా యింట్లో కూర మొదలుబెడుతుంది మా అమ్మ.

ఇస్కూలుకు పోతా పోతా, మా అమ్మ చేపల బేరం చూసినానంటే నాకు బలే కుషీ. యింకా పూట క్యారేజీ మోసుకెళ్లే బాదుండదు. అన్నం బెల్లు టయానికి మా నాయినమ్మే సాయంగా వచ్చి చేపల కూరతో అన్నం తినిపించేసి పోతుంది.

మా యింట్లో చేపల కూరది చెప్పనలవిగాని రుచి.

యీ విషయంలో మా అమ్మా నాయినమ్మా యిద్దరూ సయ్యంటే సయ్యే. మా అమ్మయితే బొమ్మ గీసినంత శ్రద్దగా చేపలకూర వొండే తరీఖా (పద్దతి)ని ఈ కళ్లతో ఎన్నిసార్లు చూసి వుంటానో.

బావిగట్టుకాడ చేపల్ని ముందరేసుకొని, కత్తితో పొలుసులు చెక్కుకొని, పొట్టకోసి లోపలిదంతా శుద్దం చేసుకొని, మట్టి సట్టిలో ఉప్పుగల్లుతో ఒకటికి నాలుగుసార్లు చేపముక్కల్ని తోముకొని, నీసు వాసన పోయిందని ఖరారు చేసుకున్నాకగాని కూర చేయడానికి పొయ్యి దగ్గిర కూచునేది కాదు మా అమ్మ. (మట్టగుడిసె చేపలు తీసుకుంటే మా అమ్మ పని మరీ కష్టం. ఆ చేపలికి వళ్ళంతా జిగట. పొయ్యిలోని బూడిదలో పొర్లించి బావి గట్టు మీద తోమితోమి శుబ్రం చేయాలి వాటిని).

పొయ్యిమీద కూరెక్కినాక యింక నా మకాం ఆణ్ణే. చింతపండు పులుసు పోసినాక బుడగలు బుడగలుగా కూర తొర్లతా వుంటే నోటి నిండుగా నీళ్లు నింపుకొని కళ్లతోటే కూర

తాగేస్తా వుండేవాణ్ణి.

కూర చేస్తున్నంతసేపు మా అమ్మ పొయ్యి కాణ్ణుంచి పక్కకి కూడా కదలదు. కూర పూర్తిగా కానిచ్చి, ముక్క బాగా ఉడికిందనుకున్నాక ఒక్క చుక్క ఆముదం జార్చి, ఆవిరి దించే ముందు చెమ్చా కూరని అరిచేతిలో పోసుకొని రుచి చూసి తృప్తిగా లేస్తుందామె.

సముద్రం చేప ఏదైనా మా అమ్మ చేసేది పులుసే. చీదలు, వంజరాలు, మాగలు, కండ సుదుములు... ఒకో దానిదీ మిటికెలెయ్యాల్సిన రుచి. యీ చేపలేవీ దొరక్కపోతేనే గతిలాక, హీనానికి పోయి ముల్వాడలన్నా, గుడ్డంగాల్లన్నా తీసుకుంటుంది మా అమ్మ. (ఈ రెండూ ఒళ్లంతా ముళ్లుండే జాతి. కూర చేసినా ముక్క తినాలంటే ముళ్లు అడ్డం పడి బలే యాతన).

ఈ చేపల పిచ్చి మా అన్నకీ నాకూ బాగా పట్టి, మేము యాడ ఆడుకుంటా వున్నా చేపల బుట్ట కనిపిస్తే చాలు సక్కా యింటికి పిలచకొచ్చేసే వాళ్లం.

ఒక రోజిట్టాగే చేపలామె కనిపిస్తే యింటికి పిలచకెళ్లినాను 'రామ్మో' అంటా.

'ఏం చేపలమ్మా అయ్యి' అనడిగింది మా అమ్మ ఆమెను చూసి.

'సొర చేపలు' అనింది చేపలామె.

'మాకొద్దులే పో తల్లా' అని, చేపలామె బుట్టదించక ముందే పంపించేసింది మా అమ్మ.

నాకు యింత బారెడొచ్చింది కోపం.

నేరుగా మా నాయినమ్మ కాడికెళ్లి 'చూడుమా అమ్మా. చేపలొస్తే తీసుకోలేదా' అని కంప్లయింటు చేసినాను.

'సొర చేపలు మనం తినకూడదు నాయినా. హరాం (నిషిద్ధం)' అనింది మా నాయినమ్మ.

నేను ఆచ్చర్యపోయినాను. 'ఎందుకుమా... చెప్పుమా' అని అడిగితే అప్పుడు మా నాయినమ్మ బలే కత చెప్పింది.

''ఖాజాఖిసర్ పీరు అని మనకు ఒక పీరు ఉండే వాడంట. ఆయన ఒక రోజు సముద్రం ఒడ్డున కూచొని క్షవరం చేయించుకుంటా ఉంటే సముద్రంలో చేపలు అదే పనిగా ఎగరతా ఉన్నాయంట. తెల్లగా మెరిసిపోతున్న ఆ చేపల్ని చూసి- ఆహా.. ఈ చేపలు బలే ఉండాయి కదా- వీటిని తిందాము అనుకొని ఖాజాఖిసర్ పీరు ఆయన చేతిలోని మంగలి కత్తిని సముద్రంలోకి విసిరినాడంట. ఖాజా ఖిసర్ పీరంతటివాడు మనల్ని తినడానికి కత్తి

విసిరినాడు కదా యింతకన్నా బాగ్యముంటుందా అని సముద్రంలోని ప్రతీ చేపా ఆ కత్తి ముందు తల వంచి తెగిపడటానికి రెడీ అయ్యిందంట. అయితే ఒక్క సొరచేప మాత్రం అస్సలు కేర్ చేయకుండా ఎగిరెగిరి దూకతా ఉందంట. అది చూసి ఉగ్రుడయిపోయిన ఖిసర్ పీరు లేచి నిలబడి 'ముసల్మానులు దీనిని తినడం హరాంగా బావించుగాక' అని శాపం బెట్టినాడంట'' అని కత ముగించింది మా నాయినమ్మ.

(ఆ తర్వాత మా నాయిన్ని అడిగితే సొరచేప 'పాలిచ్చే జీవి' కాబట్టి 'హరాం' చేసినారని చెప్పినాడు).

సముద్రం చేపల సెక్షన్ మా అమ్మదయితే, చెరువు చేపల సెక్షనంతా మా నాయినమ్మది. చెరువు చేపల్ని మా నాయినమ్మ వండుతుందిరా నాయినా... వేంచడం, తియ్యగూర, పులుసు... బాంచత్. మూడూ మూడు రఖాలే.

'మంచి నీటి చేపని తినడానికి నాలిక మీద రాసి పెట్టుండాల్రా నాయినా' అంటా ఎర్రగా కారంపట్టిన ఒకో ముక్కనీ మా కంచాల్లో వడ్డించేది మా నాయినమ్మ.

మా నాయినమ్మ పుణ్యమా అని నాకు మంచి నీటి చేపల పేర్లన్నీ తెలిసినాయి. యిసక దందులు, జల్లలు, వాల్గలు, మొయ్య, మర, బొచ్చలు... జల్లల్లో కూడా చిన్న జల్లల పులుసు సలాము చేయాల్సిన కూర.

'హైతో ఖానా' రోజు మా యింట్లో ఈ కూరలన్నీ ఉడికితే 'నైతో సోనా' రోజు ఉప్పు చేపలే గతి. మా యింట్లో కూర లేనప్పుడల్లా పాత ఫ్యారెక్సు డబ్బాలో ఎత్తి పెట్టుండే ఉప్పు చేపల్ని బయిటికి తీస్తుంటుంది మా అమ్మ. వాటికి కాంబినేషను మా నాయినమ్మ చేసే మినప్పచ్చడి. వేడివేడి అన్నంలో మినప్పచ్చడి కలుపుకొని వేంచిన తాటాకు చేపలో, కచ్చాళ్లో, మెత్తాళ్లో నంజుకుంటా ఉంటే.. సొర్గం! (రొయ్య పొట్టు సంగతి సపరేట్‌గా చెప్పాల్నా?).

చేపల కూర గురించి యింత కత ఎందుకు చెప్పినానంటే నా ఆకలికీ యీ చేపల కూరకీ జత కలిపే కత ఒకటుంది. అది చెప్పడానికి.

నాది సామాన్యమైన ఆకలి గాదు.

మా అమ్మ కట్టిచ్చే క్యారేజీని ఇస్కూలులో మధ్యానానికి సఫా చేసేసినా తర్డు పిరియడు నుంచి మళ్లా ఆకలి రేగిపోతా ఉండేది నాకు. లాస్టు పిరియడులో 'ఐస్ బాయ్', 'బజారు బంతి' లాంటి ఆటలు ఆడుకున్నాక యింకా ఆకలి నన్ను నిలబెట్టేది కాదు.

ఆ సంగతి తెలుసు కాబట్టే మా అమ్మ శేరు వొండినా అర్ధశేరు వొండినా రొంత అన్నం తీసి పక్కన పెట్టుండేది సాయింత్రానికి. అది తింటేనే నేను మనిషయ్యేది. లేకపోతే లా.

ఒకరోజు సాయింత్రం యిట్టాగే ఆకలితో నకనకలాడతా ఇస్కూలు నుంచి వచ్చేటప్పటికి ఎవురు పొట్టకోసుకున్నారో ఏమోగానీ యింట్లో మెతుకు లేదు!

దబర ఖాళీ!

అన్నం కానూకిందే కాకుండా నన్నిట్టా నా మానాన వదిలేసి పక్కింట్లో పెత్తనాలు చేస్తా ఉన్న మా అమ్మా నాయినమ్మల మీద రేగిపోయి ఏమీ చేయలాక ఏడుపొచ్చేసింది.

యిట్టా కోపం వచ్చినప్పుడు, ఏడుపు వచ్చినప్పుడు మా నాయినలాగా బొచ్చెలు పగల్నా కడం అలవాటు గాబట్టి ఏదో ఒక బొచ్చె పగల గొడదామని పొయ్యి మీద దబర తాకాను.

చెయ్యి కాలింది.

మూత తెరిచి చూస్తే వాడమ్మాబడవ- చేపల కూర. రాత్రికి తినడానికి అప్పుణ్ణే వండినట్టుంది, గమగమలాడిపోతా వుంది. దాన్ని చూడగానే నోట్లో నీళ్లూరినాయి. కడుపులో ఆకలి రేగి పోయింది.

యింక చూసుకో.

దబర దించి, బాసిమెట్టేసుకొని, కూర తాగతా తాగతా... ముక్కలు వొలుస్తా వొలుస్తా... అర్ధగంటలో అంతా అవజేసేసరికి మా అమ్మొచ్చేసింది.

నాయినా!

కడుపయితే నిండింది గానీ ఆ తర్వాత మా అమ్మ చేతిలో నేను పడిన పాట్లు ఏమని చెప్పను!

